క్లుప్తంగా

నామినేషన్ కేంద్రం వద్ద హద్దుల ఏర్పాటు



తహసీల్దార్ కార్యాలయం పరిసరాల్లో హద్దులు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

హిందూపురం: హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గం నామినేషన్ల దాఖలు నేపథ్యంలో నామినేషన్ స్వీకరణ కేంద్రమైన హిందూపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎన్నికల అధికారుల నిబంధనల మేరకు పోలీసులు హద్దులు ఏర్పాటు చేశారు. నామినేషన్ కేంద్రం పరిసరాల్లో వందమీటర్ల మేరకు ప్రధాన రహదారిలో హద్దులు ఏర్పాటు చేశారు. వంద మీటర్ల మేరకు హద్దులు పెయింట్ వేసి ఎట్టి పరిస్థితుల్లోనూ హద్దులు దాటిరావడానికి వీల్లేదని ఆంక్షలు విధించారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు, వారి నామినేషన్ బలపరిచే సాక్షి మాత్రమే కేంద్రంలోనికి అనుమతించడం జరుగుతుందని ఆర్‌ఓ అభిషేక్‌కుమార్ పేర్కొన్నారు.

‘పార్టీ మారే ప్రసక్తే లేదు’

రొళ్ల: వైఎస్సార్‌సీపీని వీడి వేరే పార్టీలో చేరుతున్నట్లు వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు కాకి ఎంపీటీసీ లక్ష్మి, ఆమె భర్త యరగుంటప్ప తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేస్తున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదన్నారు. ఎవరో కావాలనే తమపై బురదజల్లడం కోసం అసత్యాలను ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ విజయానికి కృషి చేస్తామన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.2.5 లక్షల విరాళం



నగదును అందిస్తున్న నాగేశ్వర దంపతులు

అమరాపురం: మండల పరిధిలోని తమ్మడేపల్లి గ్రామంలో బసలేనవర గోత్రానికి చెందిన ఆంజనేయస్వామి ఆలయ జీర్ణోద్ధర పనులకు గౌడనకుంటకు చెందిన బోర్‌వెల్ ఏజెంట్ నాగేశ్వర కుటుంబ సభ్యులు రూ.2.5 లక్షల నగదును ఆలయ ధర్మదర్శి రామకృష్ణారెడ్డికి బుధవారం అందజేశారు. పాత ఆలయాన్ని పడగొట్టి కొత్త ఆలయాన్ని నిర్మాణం చేస్తున్నారు. ఇందులో భాగంగా విరాళాలను ఆలయ కమిటీ సభ్యులు సేకరిస్తున్నారు.

జాగ్రత్తలతోనే ప్రమాదాల నివారణ



మంటలను ఎలా అదుపు చేయాలో వివరిస్తున్న ఫైర్ సిబ్బంది

హిందూపురం అర్బన్: తగిన జాగ్రత్తలు తీసుకోవడం వల్లనే ప్రమాదాలు జరగకుండా చూడవచ్చని ఫైర్ ఆఫీసర్ ప్రభాకర్ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని పళనినగర్, ఇందిరానగర్‌లో గ్యాస్ ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళలకు అవగాహన కల్పించారు.

మడకశిరరూరల్: పట్టణంలోని ఆదిరెడ్డిపాళ్యంలో బుధవారం అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోవాలి? మంటలు ఏవిధంగా నియంత్రించాలి తదితర వాటిని వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి విజయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎన్నికల ప్రచారం

అగళి: మండల పరిధిలోని హళ్లికెర, నరసబుంది పంచాయతీ, దోక్కలపల్లి గ్రామంలో గురువారం ఉదయం 9 గంటల నుంచి వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్ తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప ప్రచారంలో పాల్గొంటారన్నారు.

ఊపందుకున్న ప్రచారం



ప్రచారంలో బీజేపీ అభ్యర్థి గోవింద కారజోళ

పావగడ: చిత్రదుర్గం లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా బీజేపీ, జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థి గోవింద కారజోళ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. అభ్యర్థితో పాటు స్థానిక జేడీఎస్ మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప తదితర నాయకులు తాలూకాలోని లింగదహళ్లి, అరసికెరె, గుజ్జనడు, సాసలకుంటె, కన్మేడి, నాగలమడక, వైఎన్ హొసకోట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.



లేపాక్షి మండలం పులమతిలో సీతారాముల బ్రహ్మరథోత్సవం



లేపాక్షి: సీతారాముల పల్లకీసేవ ఇలా..



పరిగిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మంత్రి ఉషశ్రీచరణ్

భక్తిశ్రద్ధలతో శ్రీరామ నవమి

- కిటకిటలాడిన రామాలయాలు
- ఉట్ల పరుషలతో గ్రామాల్లో సందడి
- సీతారాముల కల్యాణాలతో పులకించిన భక్తజనం

సాక్షిబృందం: శ్రీరామ నవమి వేడుకలు అత్యంత వేడుకగా జరిగాయి. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లోని రామాలయాలు, ఆంజనేయస్వామి దేవాలయాలు బుధవారం ఉదయం నుంచే భక్తులతో కిటకిటలాడాయి. వాటితో పాటూ వేంకటేశ్వర స్వామి, లక్ష్మీనరసింహస్వామి, శివాలయాల్లోనూ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యంగా పలు ప్రాంతాల్లో నిర్వహించిన సీతారాముల కల్యాణాన్ని వీక్షించి భక్తులు పులకించిపోయారు. అలాగే ఉట్ల పరుష కార్యక్రమాలను సందడి వాతావరణం నెలకొంది. ప్రతి గ్రామంలోనూ సంప్రదాయబద్ధంగా భక్తులకు పానకాలు, పెసరు బ్యాళ్ల పంపిణీ చేశారు. సాయంత్రం పలు గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.



హిందూపురం మండలం సూగురు వద్ద ఉట్లమాను పోటీ



హిందూపురం: మెయిన్‌బజారు వద్ద వడపప్పు, పానాకాల పంపిణీ



హిందూపురం: వ్యాసరాయ ఆంజనేయస్వామి ఆలయం వద్ద సీతారాముల కల్యాణం



హిందూపురం మండలం సూగురులో అలంకరణలో ఆంజనేయస్వామి



హిందూపురం: సూగురులో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



హిందూపురం: వాల్మీకి ఆలయంలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న దృశ్యం



పెనుకొండ: అలంకరణలో ఊరువాకిలి ఆంజనేయస్వామి



రొద్దంలో సీతారాము విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు



రొళ్ల మండలం మల్లసముద్రంలో బ్రహ్మరథాన్ని లాగుతున్న భక్తులు



మడకశిర మండలం జమ్మానిపల్లిలో ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహ ఊరేగింపు



గుడిబండ: పానకం పంపిణీ చేస్తున్న దృశ్యం



పావగడ: కోటె ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



అమరాపురం ఆటో డ్రైవర్స్ ఆధ్వర్యంలో పానకం, బేడలు పంపిణీ చేస్తున్న దృశ్యం

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం



మహిళలతో సమావేశమైన మంత్రి ఉషశ్రీచరణ్



మంత్రి ఉషశ్రీచరణ్ సమక్షంలో పార్టీలో చేరిన రామప్ప తదితరులు

- మంత్రి ఉషశ్రీచరణ్

పరిగి: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి ప్రతి ఒక్కరూ శాయ శక్తులా కృషి చేయాలని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమశాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ సూచించారు. మండల కేంద్రంలో బుధవారం ఆమె విస్తృతంగా పర్యటించారు. తొలుత మంత్రికి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలింగ్ బూత్‌ల వారీగా ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు, నాయకులతో ప్రత్యేక సమావేశాలను నిర్వహించి, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై దిశానిర్దేశం చేశారు.

టీడీపీ మోసాలను నమ్మొద్దు

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా టీడీపీ నాయకులు మరోసారి ప్రజలను మోసగించడానికి వస్తున్నారని, వారి పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఉషశ్రీచరణ్ తెలిపారు. పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన మంచిని వివరించాలన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో కుల,మత, రాజకీయ వర్గ విభేదాలకు తావు లేకుండా అత్యంత పారదర్శకంగా, అవినీతి రహిత పాలన సాగించారన్నారు. జగనన్నను మరోసారి సీఎంగా చేసుకుంటేనే యథావిధిగా సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు.

టీడీపీకి ఓటేస్తే రాష్ట్రానికి చేటే

వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమికి ఓటేస్తే రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తారు. చివరకు కుక్కలు చింపిన విస్తరాకులా రాష్ట్రాన్ని మార్చేస్తారని మంత్రి ఉషశ్రీచరణ్ తెలిపారు. సంక్షేమ పథకాలకు తిలోదకాలు ఇవ్వడంతో పాటూ అవినీతి అక్రమాలకు తెరలేపుతారన్నారు. ఆ పార్టీ నాయకులకు ఓటుతోనే బుద్ధి చెప్పాలన్నారు.

స్థానిక సమస్యలపై ప్రత్యేక దృష్టి


వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి ఉషశ్రీచరణ్ తెలిపారు. ప్రధానంగా రోడ్లు, తాగునీరు తదితర మౌలిక వసతులను మెరుగు పరచడానికి కృషి చేస్తానన్నారు. మండల కేంద్రంలోని పలు ప్రదేశాల్లో నెలకొన్న నీటి సమస్యను తీర్చాలని సర్పంచ్ లక్ష్మీదేవికి సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, సర్పంచ్ లక్ష్మీదేవి, వైస్ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ సవిత, రాష్ట బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరామప్ప, ఎంపీటీసీ సభ్యులు లక్ష్మి, లింగమ్మ, కోఆప్షన్ మెంబర్ సలీం, జేసీఎస్ కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

పరిగి: మంత్రి ఉషశ్రీచరణ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు ఇర్షాద్ అహ్మద్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మైనార్టీ కుటుంబాలతో పాటూ పలువురు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం పార్టీలో చేరిన వారిలో బోయ రామప్ప, గోపినాథ్‌రెడ్డి, వహాబ్‌సాబ్, చోటూ సాబ్, వాజీద్, నూరుల్లా, సాదిక్, సనావుల్లా, షబ్బీర్, నజీర్ సాబ్, షఫీవుల్లా, మజీద్ బాషా, షబ్బీర్‌ఖాన్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఆల్తాఫ్, మున్నా, సింగారెడ్డి, రవూఫ్‌ఖాన్, మాజీ కన్వీనర్ జయరాం, చంద్రారెడ్డి, రామాంజి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచే నామినేషన్ల ప్రక్రియ

- పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికారులు



పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం

పెనుకొండ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానుండటంతో పోలీసులు, అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. గతంలో మాదిరి కాకుండా సబ్‌కలెక్టర్ కార్యాలయం లోపల, బయట ఏ పార్టీకి చెందిన వారు ఉండకుండా గట్టి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని స్పెషల్ పార్టీ పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. 2005లో టీడీపీ అభ్యర్థి నామినేషన్ సందర్భంగా ఆ పార్టీ శ్రేణులు పెద్దఎత్తున అలజడి సృష్టించడంతో పోలీసులు కాల్పులు జరపడంతో 8 మంది వ్యక్తులు మరణించారు. అలాగే ఓ ఏఎస్‌ఐ చనిపోయిన విషయం తెలిసిందే. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకున్న పోలీసులు, ఎన్నికల అధికారులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. అభ్యర్థి నామినేషన్ వేసే సమయంలో కేవలం ఐదుగురిని మాత్రమే అనుమతించేలా చర్యలు చేపట్టనున్నారు. ఇప్పటికే సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ సిబ్బంది అన్ని చర్యలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేశారు.

చంద్రబాబు మాయమాటలు నమ్మొద్దు

గుడిబండ: పేదల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ పాలన సాగించిందని ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ, ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప అన్నారు. పీఎస్ పాళ్యం, కురుబరపల్లి, ముతుకూరు, మోరుబాగల్, కెకె పాళ్యంలో బుధవారం పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత శ్రీరామ నవమి పండుగ సందర్భంగా కురుబరపల్లి వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ , వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప మాట్లాడుతూ టీడీపీ పాలనలో ఇచ్చిన ఒక్క హామీని చంద్రబాబు నెరవేర్చలేదన్నారు. చంద్రబాబు కొత్తగా చెబుతున్న అబద్ధపు హామీలను నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు. అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకే ఓటు వేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జ్ అనంతరాజు, వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, డైరెక్టర్ గగన, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాంతరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడ్, జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు, ఎంపీటీసీ సభ్యుడు పాతలింగప్ప, రాష్ట్ర ఎస్టీ సెల్ జాయింట్ సెక్రెటరీ గిరిధర్, సర్పంచులు జీబీ కరుణాకర్, అశ్వత్, జగదాంబక్రిష్టప్ప, రంగస్వామి, నాయకులు లింగరాజు, గుడ్డదహళ్లి నాగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ, ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

జూదరుల అరెస్ట్

చిలమత్తూరు: మండలంలోని పాతచామలపల్లి శివార్లలో బుధవారం పేకాట శిబిరంపై దాడి చేసి 10 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ గంగాధర్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.55,100 నగదు సీజ్ చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. కాగా పట్టుబడ్డ వారిలో టీడీపీ కార్యకర్తలు కూడా ఉన్నారు.

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షిలో బుధవారం పేకాట ఆడుతున్న 18 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ గోపి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.60,120 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఘనంగా ఉయ్యాల ఉత్సవం

అమరాపురం: మండల పరిధిలోని తమ్మడేపల్లి గ్రామానికి వెళ్లే రహదారి మధ్యలో చెరువు కట్టపై వెలసిన సిద్ధారూఢస్వామికి బుధవారం సాయంత్రం ఉయ్యాల ఉత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉయ్యాలలో స్వామి వారిని ఉంచి భక్తి గీతాలను ఆలపించారు.

నేడు రథోత్సవం

సిద్ధారూఢస్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం రథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సిద్ధేశ్వర తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

నమ్మక ద్రోహి ఇక్బాల్

- మండిపడ్డ వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు

పెనుకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భిక్షతో రాజకీయాల్లోకి వచ్చిన మహమ్మద్ ఇక్బాల్ నేడు ఆయన్నే విమర్శించడం తల్లిపాలు తాగి తల్లి రొమ్మునే గుద్దినట్లు ఉందని పెనుకొండకు చెందిన పలువురు మైనార్టీ నాయకులు మండిపడ్డారు. నమ్మక ద్రోహి ఇక్బాల్ అని విమర్శించారు. నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, కో ఆప్షన్ మెంబర్ నేమతుల్లా, కౌన్సిలర్ సద్దాం ఆయన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్బాల్‌కు వైఎస్సార్‌సీపీ తరఫున హిందూపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇచ్చారని, ఓడిపోయిన తర్వాత కూడా ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చి గౌరవించారన్నారు. కేవలం ఈసారి టికెట్ ఇవ్వలేదని ప్లేటు ఫిరాయించడం సరికాదన్నారు. ఇలాంటి విషపూరిత రాజకీయ నాయకుడిని ఎన్నడూ చూడలేదన్నారు. అల్లా కూడా ఇలాంటి వారిని క్షమించడని పేర్కొన్నారు. డబ్బుకోసం, అధికార దాహం కోసం పాకులాడుతున్న ఎమ్మెల్సీ ఇక్బాల్‌కు ప్రజలు, అల్లా తగిన గుణపాఠం నేర్పుతారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం, మైనార్టీలకు అన్ని విధాలా అండగా నిలిచారని కొనియాడారు.

నేడు మంత్రి పర్యటన

రొద్దం: మండల పరిధిలోని కంబాలపల్లి, తురకలాపట్నం, ఆర్ కుర్లపల్లి, రెడ్డిపల్లి తదితర గ్రామాల్లో మంత్రి ఉషశ్రీచరణ్ పర్యటించనున్నట్లు మంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. గురువారం ఉదయం 8 గంటలకు కంబాలపల్లి నుంచి మంత్రి పర్యటన ప్రారంభిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

వలంటీర్ల రాజీనామా



హిందూపురం: 31వార్డు సడ్లపల్లిలో రాజీనామాలు అందిస్తున్న వార్డు వలంటీర్లు

హిందూపురం: హిందూపురం మున్సిపాలిటీ పరిధిలో రెండు రోజుల్లో వివిధ వార్డులకు చెందిన 80 మందికి పైగా వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఈ మేరకు మున్సిపల్ అధికారులకు రాజీనామా పత్రాలు అందజేశారు. నిస్వార్థంగా సేవలందిస్తున్న తమకు అనవసరంగా రాజకీయ రంగు పులమడం సరికాదని వలంటీర్లు వాపోతున్నారు.

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురం మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న 25 మంది వలంటీర్లు బుధవారం స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ వాగేష్ ఆధ్వర్యంలో మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. వలంటీర్లు మూర్తి, సిద్ధేశ్వర, సురేష్‌కుమార్, గణేష్, తదితరులు మాట్లాడుతూ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయ్యేలా తామంతా సర్పంచ్ వాగేష్ ఆధ్వర్యంలో పనిచేస్తామన్నారు.

వ్యక్తికి గాయాలు

పావగడ: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజవంతి గ్రామ సమీపంలో ఎస్ఆర్ఎస్ పెట్రోల్ బంకు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తాలూకాలోని బ్యాడనూరు గ్రామానికి చెందిన అశోక్ అనే యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. బాధితుడు మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనంలో మడకశిర వైపు వెళ్తుండగా మార్గమధ్యలో రాజవంతి గ్రామంలో ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే బాధితుడిని బెంగళూరు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సురేశ్ తెలిపారు.

పెనుకొండలో ట్రాఫిక్ ఆంక్షలు

పెనుకొండ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురువారం నుంచి ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ ఆంక్షలు పాటించాలని ఎస్‌ఐ రాజేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి 25 వరకూ స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ పర్వం ఉంటుందన్నారు. దీంతో ట్రాఫిక్ ఆంక్షలు విధించామన్నారు. పట్టణంలో ఎస్‌కేడీవై జంక్షన్ నుంచి వచ్చే భారీ వాహనాలు మడకశిరకు వెళ్లే హైవే ద్వారా హరిపురం వరకూ వచ్చి ఎన్‌టీఆర్ సర్కిల్ మీదుగా మడకశిరకు వెళ్లాలన్నారు. పట్టణంలోని వాహనాలు అంబేడ్కర్ సర్కిల్, తెలుగుతల్లి సర్కిల్ మీదుగా మడకశిర రోడ్డు, అనంతపురం రోడ్డుకు వెళ్లాలన్నారు. డీఎస్పీ కార్యాలయం మీదుగా వచ్చే వాహనాలు ఎన్‌టీఆర్ సర్కిల్, తెలుగు తల్లి సర్కిల్ మీదుగా వెళ్లాలని సూచించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఆంక్షలు ఉంటాయన్నారు.

నాచేపల్లిలో ఎన్నికల ప్రచారం

గుడిబండ: మండల పరిధిలోని నాచేపల్లి గ్రామంలో బుధవారం అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జ్ అనంతరాజు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జరిగిన మంచిని వివరించారు. ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ, ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్పను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ రమేష్, డీలర్ రాజన్న, నాయకులు శేఖర్, అశ్వత్, నాగేష్, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.